

భద్రత కల్పించాలి

మహిళా డాక్టర్లు, సిబ్బంది అస్పత్రుల్లో ఎలాంటి రక్షణ లేని వాతావరణంలో పని చేస్తున్నారు. ఈ విషయం కోల్‌కతా ఘటనతో స్పష్టంగా తెలిసింది. అభద్రతా భావనలో పని చేయడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. మానసికంగా ఒత్తిడితో విధులపై దృష్టి సారించలేరు. ఈ పరిస్థితి నుంచి వైద్య సిబ్బంది బయటపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి రక్షణ కల్పించే దిశగా అందరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ మాసీలామణి, విశ్రాంత డీఎంహెచ్‌ఓ



ధైర్యం కల్పించాలి

ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య సిబ్బందిపై దాడులు దారుణం. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన అమానుషం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా వైద్య సిబ్బంది భద్రతకు కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుని ధైర్యంగా విధులు నిర్వహించే పరిస్థితిని వైద్యసిబ్బందిలో కల్పించాలి.

–కామేశ్వరి, ఏఎన్‌ఎం, చేజర్ల



కఠిన చట్టాలు అవసరం

మహిళలపై జరిగే దాడులను అరికట్టేందుకు కఠిన చట్టాలు అవసరం. మహిళలపై దాడులకు పాల్పడే మృగాళ్లను శిక్షించేందుకు ఇప్పుడున్న చట్టాలు సరిపోవు. పాఠశాల, కళాశాల స్థాయి నుంచే మహిళలకు మానసిక ధైర్యంతో పాటు కరాటేను నేర్పించాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దారుణం. దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి.

– డాక్టర్ షేక్ మెహతాబ్, చేజర్ల పీహెచ్‌సీ



అంగరంగ వైభవంగా..

శ్రీకృష్ణ నామస్మరణతో సింహపురి పరవశించిపోయింది. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని నగరంలోని వివిధ ఆలయాల్లో కొలువైన శ్రీకృష్ణుని దర్శించుకునేందుకు భక్తులు సోమవారం పోటెత్తారు. ధర్మరక్షణ కోసం శ్రీకృష్ణభగవానుడు ఆవిర్భవించారంటూ దేవదేవుని కీర్తిస్తూ వివిధ కార్యక్రమాలను చేపట్టారు. వేదపండితులు శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను వివరించారు. వాడవాడలా యువత ఉల్లాసంగా ఉట్టి మహోత్సవంలో పాల్గొన్నారు. చిన్నారులు రాధా, కృష్ణ, గోపికల వేషధారణలో అలరించారు.

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నెల్లూరు(బృందావనం) : సర్వవ్యాపితమైన అజ్ఞానాన్ని పారదోలేందుకు కృష్ణనామమొక్కటే మార్గమని ఇస్కాన్ (అంతర్జాతీయ శ్రీకృష్ణచైతన్య సంఘం) నెల్లూరు అధ్యక్షుడు డాక్టర్ శుభ్‌దేవస్వామి ప్రవచించారు. మినీబైపాస్‌రోడ్డు దగ్గర ఇస్కాన్‌సిటీలోని 'ఇస్కాన్' మందిరంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపన్యసిస్తూ నేడు ఎవరికి తోచినట్లు వారు జీవనం సాగిస్తూ సమాజంలో ఎన్నో అమానవీయ, అనాగరిక, అనైతిక, ఆడంబర ఆర్భాటాల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ శైలి నుంచి సమాజం వెలుపలికి రావాలంటే భగవద్గీత గురించి తెలుసుకుని కృష్ణ చైతన్యం అంగీకరించాలన్నారు. కాగా ఇస్కాన్‌లో వేకువజామున విశేషపూజలు నిర్వహించారు. అనంతరం మందిరంలో కొలువైన జగన్నాథ బలరామసుభద్రలు



ఇస్కాన్ మందిరంలో విశేషాలంకరణలో స్వామి, అమ్మవార్లు

విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భజనలు, కీర్తనలతో మందిరం హోరెత్తింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయలలో బాలకృష్ణుడికి ఊంజల్ సేవ గావించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ పాల్గొన్నారు. అర్ధరాత్రి 12 గంటలకు మహా హారతి, 108 వంటకాలతో నివేదన, మహాప్రసాద వితరణ చేశారు.

➡ ఎంజీబీ మాల్ దగ్గర కొండాబలరామిరెడ్డి వీధిలో ఉన్న శివకేశవుల దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. తొలుత ఉట్టి మహోత్సవాన్ని మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, మోడెం మల్లికార్జునరావు ప్రారంభించారు. ఈ వేడుకలను కొండా బలరామిరెడ్డి, జలకం మనోహర్‌బాబు, గ్రంధి చల్లారావు, మోడెం మల్లికార్జునరావు, బట్టేపాటి హరిప్రసాద్ రెడ్డి, రాటకొండ రమణయ్యనాయుడు తదితరుల సహకారంతో ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ దర్శిగుంట పెంచలయ్య తెలిపారు. ట్రస్ట్ సభ్యులు రాచపూడి మధు, గోవిందు, మునిరాజా, లోకనాథం, మల్లికార్జున్, విజయసాయి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

➡ వేదాయపాళెం గాంధీనగర్‌లో ఉన్న కృష్ణమందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు బి.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో తులసీదళాలతో సహస్రనామార్చన, బంగారు పుష్పాలతో అష్టోత్తరపూజలు నిర్వహించారు. ధర్మకర్త చిత్తూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవం జరిగింది. రాత్రి స్వామివారి నగరోత్సవం చేపట్టారు. భక్తుల కోలాట ప్రదర్శన అలరించింది. కార్యక్రమాలను మందిర ధర్మకర్త సీహెచ్.వెంకటేశ్వర్లు, కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బీవీ రాఘవేంద్ర, ఎస్.వేణుబాబు, ప్రధాన కార్యదర్శి ఎస్.సుబ్బరామరాజు, ఉపకార్యదర్శి ఎంఎల్ నరసింహ యాదవ్, కోశాధికారి వి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

➡ ఏసీ స్టేడియం వద్ద సుజాతమ్మ కాలనీలోని శ్రీకృష్ణ మందిరంలో ఉదయం స్వామివారికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం, రాత్రి పల్లకిసేవ నిర్వహించారు. అలాగే అష్టలక్ష్మి మందిరంలో అమ్మవారు స్వర్ణకవచ అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఉభయకర్తలుగా ఎస్.గిరికుమార్, నిర్మల దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కృష్ణ జన్మాష్టమి సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. చిన్నారులు నృత్య ప్రదర్శన అలరించింది. ఉభయకర్తలుగా అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా– గీతాంజలి దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను మందిర నిర్వాహకులు పర్యవేక్షించారు.

➡ బాలాజీనగర్ మెయిన్‌రోడ్డులోని కృష్ణాష్టమి సెంటర్ వద్ద చిరంజీవి సేవా సమితి రాష్ట్ర కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తాత్కాలికంగా శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఏసీ సుబ్బారెడ్డి, దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, గునుకుల కిశోర్ పాల్గొన్నారు.

➡ మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఉట్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి.చంద్రశేఖర్ పర్యవేక్షించారు.



సుజాతమ్మకాలనీలోని కృష్ణమందిరంలో..



శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలో చిన్నారులు



క్రాంతినగర్‌లోని శివకేశవుల దేవస్థానంలో..



గాంధీనగర్‌లోని కృష్ణమందిరంలో..



వేణుగోపాలస్వామి దేవస్థానంలో..




ఉట్టి కొడుతున్న యువకులు



స్వర్ణకవచ అలంకారంలో అమ్మవారు



బాలాజీనగర్ కృష్ణాష్టమి సెంటర్‌లో..



ఊంజల్ సేవలో శ్రీకృష్ణుడు



అభిషేక కార్యక్రమంలో కమిషనర్ సూర్యతేజ



సీతారామస్వామి మందిరంలో నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

క్లుప్తంగా

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

నెల్లూరు (టౌన్) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక శ్రీవెంకటేశ్వర విద్యాలయంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యూనిఫైడ్ పెన్షన్ విధానం ఉద్యోగులకు ఆమోదయోగ్యం కాదని, ఉద్యోగి ఖాతాలో ఉన్న మొత్తం ఏమి చేస్తారన్నది వివరణ లేదన్నారు. పని సర్దుబాటు సరిగ్గా లేదని, గ్రీవెన్స్ పరిష్కరించిన తరువాతే సర్దుబాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర బాధ్యులు జుల్ఫికర్‌ఆలీ, ఐఫియా చీఫ్ ప్యాట్రన్ సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు మురళీకృష్ణ, కరీంమొహిద్దీన్, తిరుపతిరెడ్డి, బాలత్రిపురసుందరి, విజయభారతి, జిల్లా కమిటీ సభ్యులు రామసుబ్బారెడ్డి, శివకుమార్, పెంచలయ్య, శ్రీనివాసులు, వెంగయ్య, సుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంగబాబు, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

నెల్లూరు జట్టు విజయం



రాజారెడ్డి స్టేడియంలో తలపడుతున్న నెల్లూరు - కర్నూలు జట్ల క్రీడాకారులు



79 పరుగులు చేసిన మాధవ్

కడప స్పోర్ట్స్: కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు జట్టు విజయం సాధించింది. 51 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడోరోజు సోమవారం బరిలోకి దిగిన నెల్లూరు జట్టు 67.5 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 323 పరుగులు చేసింది. జట్టులోని షేక్ బాజీ 55 పరుగులు, మాధవ్ 79 పరుగులు చేశారు. కర్నూలు బౌలర్లు కనిష్ 3, సాయిసూర్యతేజారెడ్డి 2 వికెట్లు తీశారు. కాగా తొలి ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 259 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు 174 పరుగులు చేసింది. కర్నూలు జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 237 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు

నెల్లూరు(అర్బన్) : స్థానిక కిసాన్‌నగర్‌లోని మల్లెతోట కాలనీలో జయభారత్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. సాధారణ వైద్యసేవలతో పాటు కంటి వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిబిరం ఇన్‌చార్జి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కంటి ఆపరేషన్లు అవసరమైన వారందరికీ జయభారత్ ఆస్పత్రిలో ఉచితంగా చేస్తామన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ సౌమ్య, హాస్పిటల్ సిబ్బంది ఈశ్వరి, రాజేశ్వరి, ప్రమీలా, పెద్ద సంఖ్యలో పేషెంట్లు పాల్గొన్నారు.

డీబీఎస్‌ఐపై ఉపాధ్యాయులకు శిక్షణ నేడు

కొడవలూరు : డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా(డీబీఎస్ఐ) ప్రాజెక్ట్‌పై కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జి.వసంతకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం కొడవలూరు విద్యా వనరుల కేంద్రంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు పైమూడు మండలాల్లో పాఠశాలకు ఒక టీచర్ వంతున ఎంపిక చేశారని, వారు విధిగా హాజరు కావాలని సూచించారు.

మదర్ థెరిస్సాకు ఘన నివాళి

నెల్లూరు(బృందావనం) : రైల్వేఫీడర్స్‌రోడ్డులోని లోన్‌స్టార్ చర్చిలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్ మాట్లాడుతూ మదర్ థెరిస్సా జీవనం సర్వమానవాళికి మార్గదర్శకమన్నారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు. అందులో భాగంగా కన్వీనర్ల నియామకం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పీడబ్ల్యూఏ నేషనల్ కన్వీనర్ జయప్రకాష్, క్రైస్తవ సంఘం నేత కలివెల ఎలీషాకుమార్, పీడబ్ల్యూఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐఎస్ బెన్హర్‌బాబు, కూరపాటి విజయకుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏసురత్నం, జిల్లా ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఎస్ రాజు, రమేష్, కోశాధికారి కిశోర్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా తదితరులు పాల్గొన్నారు.



మదర్ థెరిస్సా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

నేత్రపర్వం.. నృసింహుని కల్యాణం



కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు



తిలకిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం) : పద్మావతినగర్‌లోని శ్రీసాయిదర్బార్ అద్దాల మందిరానికి అనుబంధంగా ఉన్న సాయిమాత నిత్య అన్నప్రసాదాలయం ద్వారకామయిలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత పెనుశిల లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. ఈ సందర్భంగా అన్నమాచార్య సంకీర్తనలు, పండరి భజనలు, కోలాట కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. ఉభయకర్తలుగా నున్నా కిరణ్‌కుమార్– సుధా, సర్రాజు మురళీధర్‌రావు– అన్నపూర్ణ దంపతులు వ్యవహరించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నసంతర్పణ నిర్వహించారు. దీనికి ఉభయకర్తలుగా సింగంశెట్టి నవీన్– మాణిక్యప్రభ, ఏల్చూరి రామకృష్ణ– రేవతి, సొల్లేటి వెంకటనరసయ్య– లక్ష్మీసుప్రియ, సొల్లేటి సత్యనారాయణ– సత్యవేణి, సరాబు నరసింహులు– మహాలక్ష్మి దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సాయిదర్బార్ అద్దాల మందిరం చైర్మన్ మధుసాయి, గౌరవ సలహాదారు పాటిబోలు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

పేకాట కేంద్రంపై దాడి

నెల్లూరు(క్రైమ్): బాలాజీ నగర్ గౌడ హాస్టల్ సమీపంలో ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై సోమవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.1,04,900 నగదును స్వాధీనం చేసుకున్నట్లు బాలాజీ నగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు వెల్లడించారు.

మైనింగ్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- ప్రతి ఫైల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్న అధికారులు



డీడీ కార్యాలయం

నెల్లూరు (క్రైమ్): అక్రమ మైనింగ్‌పై గడిచిన మూడు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మైనింగ్ శాఖ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నెల్లూరు ఏసీబీ డీఎస్పీ శిరీషా నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు విజయకుమార్, ఆంజనేయరెడ్డి తమ సిబ్బందితో కలిసి నెల్లూరు ఆటోనగర్‌లోని మైనింగ్ డీడీ కార్యాలయంలో సోదాలు చేస్తున్నారు. సోమవారమూ సోదాలు కొనసాగాయి. జిల్లాలో ఎన్ని ఇసుక రీచ్‌లకు అనుమతులు ఉన్నాయి? ఎంత మేరకు తవ్వకాలు జరిగాయి? రవాణా తదితర శాఖలకు సంబంధించి మైనింగ్ అధికారుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు క్షుణ్ణంగా ప్రతి ఫైల్‌ను పరిశీలిస్తున్నారు. మైనింగ్ అనుమతులు, తవ్వకాలు నిబంధనల మేరకు జరిగాయా తదితరాలకు సంబంధించిన ఫైల్స్‌ను సైతం పరిశీలిస్తున్నారు. సోదాల పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు ఏసీబీ అధికారులు పేర్కొంటున్నారు.

ఉత్సాహంగా క్రీడా ప్రతిజ్ఞ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఫిట్ ఇండియా ప్రతిజ్ఞను అధికారులు, క్రీడాకారులు ఉత్సాహంగా చేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే.యతిరాజ్, సెట్నెల్ సీఈఓ వెంకటయ్య క్రీడా స్ఫూర్తిని ఉద్దేశించి మాట్లాడారు. క్రీడాదినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వారికి వంద మీటర్ల పరుగు, బ్రిస్క్ వాక్, చెస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 40 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వారికి 50 మీటర్ల పరుగు, 30 మీటర్ల వాక్, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు, 60 ఏళ్లు పైబడిన వారికి 50 మీటర్ల వాక్, యోగా పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ అంశాలకు చెందిన క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న క్రీడాకారులు, అధికారులు

ఘనంగా 'సింసం' వార్షికోత్సవం



గువాహటి ఎయిర్‌పోర్ట్ రీజనల్ డైరెక్టర్ రాజకిశోర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



శృతిసమన్వి నాట్య ప్రదర్శన

నెల్లూరు(బృందావనం) : నగరంలోని టౌన్‌హాల్లో సింహపురి సంస్కృతి సమాఖ్య (సింసం) 29వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, మెజీషియన్ రాంజీ ఆధ్వర్యంలో తొలుత ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా గువాహటి (గౌహతి) రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.రాజకిశోర్‌ను సన్మానించారు. 'సింసం అభినందన చందనమాల' పురస్కారాన్ని అందజేశారు. అలాగే డాక్టర్ పి.రాఘవరెడ్డి(బుచ్చిరెడ్డిపాళెం), మెట్టు రామచంద్రప్రసాద్ (పద్యకళాపరిషత్), ఎం.విజయప్రకాష్‌రావు(హెచ్‌ఎం), దుగ్గి మధు (ఉపాధ్యాయుడు), ఉప్పు భాస్కర్(సమాజసేవకుడు)లకు పురస్కారాలను అందజేసి అభినందించారు. విజయవాడకు చెందిన కూచిపూడి నృత్యకారిణి శృతిసమన్వి నాట్యప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో మెజీషియన్ ఏకే రాయల్, విశ్రాంత సబ్‌రిజిస్ట్రార్ పూడి నరేంద్ర, శంషాబాద్ ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గంగావత్ వెంకన్న, జమీన్ రైతు వారపత్రిక సంపాదకుడు ఎస్.డోలేంద్రప్రసాద్, హైటెక్ ఫార్మా అధినేత ఎన్వీ రమణారెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.